# ప్రజాస్వరం
PRAJASWARAM తెలుగు దినపత్రిక

**Bullet Edition**

సోమవారం 25 నవంబరు 2024 www.prajaaswaramdaily.com 4 pm


# మళ్లీ అగ్రస్థానానికి భారత్

## పెర్త్ టెస్ట్ లో ఆసీస్‌పై ఘన విజయం..

క్రికెట్ : ఆసీస్ పర్యటనను టీం ఇండియా విజయంతో మొదలుపెట్టింది. పెర్త్ వేదికగా ఆసీస్ వర్సెస్ ఇండియా తొలి టెస్టు జరిగింది. ఇందులో 295 పరుగుల తేడాతో ఆసీస్ను చిత్తు చేసింది. దీంతో ఐదు టెస్టుల సిరీస్‌లో 1-0 ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ పాయింట్లలోనూ మళ్లీ అగ్రస్థానానికి చేరుకుంది. ప్రస్తుతం డబ్ల్యూటీసీ టేబుల్‌లో భారత్ 61.11 శాతం సాధించింది. ఇప్పటి వరకు 15 టెస్టులు ఆడిన టీమ్‌ఇండియా 9 మ్యాచుల్లో గెలిచింది. ఐదింట్లో ఓడిపోయింది. ఒకటి డ్రాగా ముగిసింది. మొత్తం 98 పాయింట్లు భారత్ ఖాతాలో ఉన్నాయి. ఇక రెండో స్థానంలో ఉన్న ఆసీస్ 57.69 శాతంతో కొనసాగుతోంది. మొత్తం 13 మ్యాచుల్లో 8 విజయాలు, నాలుగు ఓటములను చవిచూసింది. ఈ మ్యాచ్ ముందు వరకు ఆసీస్ 62.50 శాతం, భారత్ 58.33 శాతం తొలి రెండు స్థానాల్లో ఉండేవి. ఇప్పుడు తారుమారు కావడం విశేషం. వచ్చే ఏడాది జూన్‌లో జరగబోయే టెస్ట్ ఫైనల్‌లో భారత్ తలపడాలంటే ఈ సిరీస్‌ను కనీసం 4-0 తేడాతో దక్కించుకోవాల్సి ఉంది.



పెర్త్ టెస్ట్ స్కోరు బోర్డు

| టీం | ఇన్నింగ్స్ | పరుగులు |
|---|---|---|
| ఇండియా | 1, 2వ | 150/ 487/7 |
| ఆసీస్ | 1, 2వ | 104/ 238 |

## కేసీఆర్ కుటుంబంలో సీఎం సీటుకు

# పోటీ ఎక్కువ

**కేటీఆర్ జైలుకు వెళ్లాలని తహతహ**

జైలుకు వెళ్తే ముఖ్యమంత్రి అవ్వొచ్చని అనుకుంటున్నారు

ఇప్పటికే కవిత వెళ్లొచ్చారు..

అలా వెళ్లి వచ్చిన వారు సీఎం అయ్యేదుంటే కవితకు చాన్స్?

స్కిల్ యూనివర్సిటీకి రూ.100 కోట్ల అదానీ విరాళం తిరస్కరిస్తున్నాం:

సీఎం రేవంత్ రెడ్డి

"బీఆర్ఎస్ సర్కారు అదానీకి గతంలో ఎన్నో ప్రాజెక్టులు ఇచ్చిందన్నారు. అదానీతో బీఆర్ఎస్ సర్కారు అంటకాగిందన్నారు. అదానీ వద్ద వాళ్లు కమీషన్లు తిన్నారని సీఎం రేవంత్ రెడ్డి ఆరోపించారు. కేటీఆర్ జైలుకు వెళ్లాలని తహతహలాడుతున్నారని ఎద్దేవా చేశారు. జైలుకెళ్తే సీఎం అవ్వొచ్చని అనుకొంటున్నారన్నారు. కేసీఆర్ కుటుంబం నుంచి ఇప్పటికే కవిత జైలుకు వెళ్లారన్నారు. జైలుకెళ్లిన వారు సీఎం అయ్యేదుంటే ముందు కవిత అవుతారన్నారు. కేసీఆర్ కుటుంబంలో సీఎం సీటు కోసం పోటీ ఎక్కువగా ఉందన్నారు. (హైదరాబాద్ )



## రూ.100 కోట్లు వద్దని అదానీ గ్రూపునకు లేఖ

స్కిల్ యూనివర్సిటీకి అదానీ ఇస్తానన్న వంద కోట్లను తెలంగాణ ప్రభుత్వం స్వీకరించడానికి సిద్ధంగా లేదని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. డబ్బు ట్రాన్స్‌ఫర్ చేయొద్దని అదానీ గ్రూప్‌కు లేఖ రాశాం అని అన్నారు. అదానీ సంస్థ నుంచి రూ.100 కోట్లు స్వీకరించొద్దని నిర్ణయం తీసుకున్నామన్నారు. అనవసర వివాదాల్లోకి తెలంగాణ ప్రభుత్వాన్ని లాగొద్దు సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టత నిచ్చారు. అదానీ గ్రూపుపై లంచాల విమర్శల నేపథ్యంలో తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఈ విషయాన్ని తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి విలేకరుల సమావేశంలో వెల్లడించారు.

## అనవసర వివాదాల్లోకి లాగొద్దు

అదానీ విషయంలో కొన్ని రోజులుగా దేశ వ్యాప్తంగా చర్చలు జరుగుతున్నాయన్నారు. అదానీ నుంచి తెలంగాణ ప్రభుత్వం నిధులు స్వీకరించిందని కొందరు విమర్శలు చేస్తున్నారన్నారు. రాజ్యాంగ బద్ధంగా, చట్టబద్ధంగానే అదానీ నుంచి పెట్టుబడులు అనుమతిస్తామన్నారు. నిబంధనల మేరకే టెండర్లు పిలిచి ప్రాజెక్టులు ఇస్తున్నామని చెప్పారు. దేశంలో ఏ సంస్థకైనా చట్టబద్ధంగా వ్యాపారం చేసుకొనే హక్కు ఉంటుందన్నారు. అంబానీ, అదానీ, టాటా.. ఎవరికైనా తెలంగాణలో వ్యాపారం చేసుకొనే హక్కు ఉందన్నారు. గొప్ప సంకల్పంతో లక్షలాది మంది నిరుద్యోగులకు సాంకేతిక నైపుణ్యం నేర్పించే లక్ష్యంతో స్కిల్స్ యూనివర్సిటీని ప్రారంభించామన్నారు. గొప్ప సదుద్దేశంతో ప్రారంభించిన ఈ వర్సిటీ వివాదాలకు లోను కావడం మంత్రివర్గ సహచరులకు, తనకు, ప్రభుత్వానికి ఇష్టంలేదన్నారు. అదానీ గ్రూపు స్కిల్స్ వర్సిటీకి ఇచ్చిన విరాళాన్ని సీఎం, మంత్రులకు ఇచ్చినట్లు కొందరు ప్రచారం చేస్తున్నారన్నారు. సీఎస్ఆర్ కింద స్కిల్స్ వర్సిటీకి అదానీ గ్రూప్ ప్రకటించిన రూ.100 కోట్లు బదిలీ చేయొద్దని కోరుతూ ఆ గ్రూపునకు లేఖ పంపామన్నారు. అనవసర వివాదాల్లోకి రాష్ట్ర ప్రభుత్వాన్ని లాగొద్దన్నారు. తెలంగాణ ప్రభుత్వ ఖాతాల్లోకి ఎవరి నుంచీ డబ్బులు రాలేదని అని సీఎం అన్నారు.

## ఢిల్లీకి ఎన్నిసార్లయినా వెళ్తా

నేటి ఢిల్లీ పర్యటనకు రాజకీయాలతో సంబంధంలేదన్నారు. లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా కుమార్తె వివాహం కోసమే ఢిల్లీకి వెళ్తున్నానన్నారు. పార్లమెంటు సమావేశాలపై ఎంపీలతో మంగళవారం చర్చిస్తామన్నారు. అందుబాటులో ఉన్న కేంద్ర మంత్రులను రేపు కలిసి రాష్ట్ర సమస్యల్ని వివరిస్తామని స్పష్టం చేశారు. 28 సార్లు ఢిల్లీ వెళ్లానని కొందరు విమర్శిస్తున్నారు. నేను వారిలా పైరవీలు చేయడానికో.. బెయిల్ కోసం ఢిల్లీకి వెళ్లలేదన్నారు. కేంద్రం నుంచి మనకు రావాల్సినవి రాబట్టుకోవాలని, అవసరమైతే ఢిల్లీకి ఎన్నిసార్లయినా వెళ్తామన్నారు. ఈరోజు మహబూబాబాద్ లో కేటీఆర్ 28 సార్లు ఢిల్లీకి వెళ్లి 28 రూపాయలు కూడా తీసుకోరాలేదని విమర్శించడం విదితమే.

చైర్మన్ కు ఎమ్మెల్సీ కవిత వినతి

కులగణనపై అనుమానాలున్నాయని వెల్లడి

## రిజర్వేషన్లపై కాంగ్రెస్ తాత్సారం



**హైదరాబాద్ :** బీసీ రిజర్వేషన్లకు సంబంధించి డెడికేటెడ్ కమిషన్ చైర్మన్ బూసాని వెంకటేశ్వరరావుకు బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత వినతిపత్రం ఇచ్చారు. తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో సిద్ధం చేసిన 35 పేజీల నివేదికను కమిషన్ చైర్మన్‌కు ఆమె అందించారు. బీసీ సంఘాలు, యునైటెడ్ పూలే ఫ్రంట్, తెలంగాణ జాగృతి నాయకులతో కలిసి ఈ నివేదికను సమర్పించారు. అనంతరం ఆమె విలేకరులతో మాట్లాడుతూ... బీసీ రిజర్వేషన్లకు సంబంధించి కామారెడ్డి డిక్లరేషన్‌ను యథాతథంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. రిజర్వేషన్లపై కాంగ్రెస్ ప్రభుత్వం 11 నెలలు తాత్సారం చేసిందని ఆరోపించారు. డెడికేటెడ్ కమిషన్ స్వతంత్రంగా పని చేయాలని ఆకాంక్షించారు.

అయినా ప్రత్యేక కార్యాలయం, మానవ వనరులు, సామాగ్రి ఇవ్వకుంటే ఆ కమిటీ ఎలా పని చేస్తుందని ప్రశ్నించారు. కులగణనపై నెల రోజుల్లోనే నివేదిక అంటే ఎన్నో అనుమానాలు వస్తున్నాయన్నారు. రిజర్వేషన్ల అంశంపై కాంగ్రెస్ ప్రభుత్వం సమాధానం చెప్పాలన్నారు. హైదరాబాద్‌లో ఇప్పటికీ స్టిక్కర్ వేయని ఇళ్లు దాదాపు 70 శాతం ఉన్నాయని, కానీ సర్వే మాత్రం 90 శాతం పూర్తయిందని చెప్పడం ఏమిటన్నారు.

# తీర్పు రిజర్వ్

మూడు ఎఫ్ఐఆర్ ల నమోదుపై

హైకోర్టులో మాజీ ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి పిటిషన్

దీనిపై హైకోర్టులో ముగిసిన వాదనలు



హైదరాబాద్: కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌పై తెలంగాణ హైకోర్టులో విచారణ జరిగింది. లగచర్ల దాడి ఘటనలో బొంరాస్‌పేట పోలీసులు 3 ఎఫ్ఐఆర్‌లు నమోదు చేశారు. ఒకే ఘటనపై వేర్వేరు కేసులు నమోదు చేయడాన్ని నరేందర్ రెడ్డి ఉన్నత న్యాయ స్థానంలో సవాల్ చేశారు. ఈ నేపథ్యంలో వాదనల సందర్భంగా ఒకే సంఘటనపై వేర్వేరు కేసులు నమోదు చేయొద్దన్న సుప్రీంకోర్టు తీర్పులను పిటిషనర్ తరఫు న్యాయవాది ప్రస్తావించారు. కేసులకు సంబంధించిన వివరాలను ఏఏజీ రజనీకాంత్ కోర్టుకు తెలిపారు. దాడి ఆధారంగా పోలీసులు వేర్వేరు కేసులు నమోదు చేశారని చెప్పారు. ఇరువైపుల వాదనలు ముగియడంతో.. హైకోర్టు తీర్పును రిజర్వ్ చేసింది.

## మహారాష్ట్రలో బీఆర్ఎస్

# ఎందుకు పోటీ చేయలేదు?

పార్టీ పేరు మార్చినప్పుడు అక్కడికి వందల కార్లలో వెళ్లారుగా..

బీజేపీ, బీఆర్ఎస్ ఢిల్లీలో దోస్తీ.. గల్లీలో కుస్తీ

ఆర్థిక క్రమశిక్షణతో ఒక్కో హామీ నెరవేరుస్తున్నాం

మంత్రి పొన్నం ప్రభాకర్

హుజూరాబాద్: టీఆర్ఎస్ ను బీఆర్ఎస్ గా పేరు మార్చి అప్పట్లో మహారాష్ట్రకు వందల కార్లలో వెళ్లి కనీసం పోటీ కూడా చేయలేకపోయారు. మేం మొదటి నుంచీ చెబుతున్నాం. బీఆర్ఎస్, బీజేపీ ఢిల్లీలో దోస్తీ.. గల్లీలో కుస్తీలా వ్యవహరిస్తున్నాయని, ఇది మరోసారి నిరూపణ అయిందని, అందుకే పార్లమెంటు ఎన్నికల్లో కారు పార్టీకి ఒక్క సీటు కూడా సాధించలేకపోయిందని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు.

మహారాష్ట్ర ఎన్నికల్లో కాంగ్రెస్ ఓటమిపాలైందని మాజీ మంత్రి హరీశ్‌రావు సంబర పడుతున్నారా? బీజేపీ గెలిచిందని సంతోషపడుతున్నారా? అని ప్రశ్నించారు. హుజూరాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి మంత్రి హాజరై మాట్లాడారు. ప్రతిదీ రాజకీయంగా ఆలోచిస్తే ప్రజాస్వామ్యం మనుగడకే ప్రమాదమన్నారు. మొన్నటి వరకు పంట మొత్తం కాళేశ్వరం వల్లే అన్నారన్నారు.. కాళేశ్వరం లేకున్నా ఎల్లంపల్లి నుంచి పొదుపుగా నీరు వాడుకొని ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కూడా రాని పంట ఇప్పుడు వచ్చిందన్నారు. ప్రకృతి సహకరించిందన్నారు. రూ.20 వేల కోట్ల బకాయిలు చెల్లించాలని రైస్ మిల్లర్లకు చెప్పామన్నారు. ఇంకా ఎవరైనా ఉంటే ప్రభుత్వంతో మాట్లాడి బకాయిలు చెల్లించాలన్నారు. ధాన్యం కొనుగోళ్లలో కొంత ఆలస్యం అయినందుకు కల్లాల వద్దకు వచ్చి ప్రతిపక్ష నాయకులు ఇష్టారీతిన మాట్లాడారన్నారు. సన్న వడ్లకి రూ.500 బోనస్ ఇస్తున్నామన్నారు. రాష్ట్రంలో ఎవరికైనా రాకపోతే చెప్పాలన్నారు. మాట మీద నిలబడి రూ.2 లక్షల రైతు రుణమాఫీ చేశామన్నారు. ఎవరికైనా రుణమాఫీ కాకపోతే వ్యవసాయ అధికారుల ద్వారా కుటుంబ నిర్ధరణ జరుగుతోందన్నారు. ప్రభుత్వం సమాచారం సేకరిస్తుందని చెప్పారు. వారికి కూడా తప్పకుండా రుణమాఫీ చేసే బాధ్యత మా ప్రభుత్వానిదేనన్నారు.

ప్రజా పాలనలో మంత్రులు, ఎమ్మెల్యేలను ప్రజలు స్వేచ్ఛగా కలవగలుగుతున్నామన్నారు. తమ ప్రభుత్వం ఏర్పడిన వెంటనే చూస్తే రాష్ట్ర ఖజానా ఖాళీగా ఉందన్నారు.. అయినా ఆర్థిక క్రమశిక్షణ పాటిస్తూ ఒక్కో హామీని నెరవేరుస్తున్నాన్నారు. ఎన్నో ఇబ్బందులు ఉన్నా ఒకటో తేదీనే జీతాలు వస్తున్నాయన్నారు. 11 నెలల్లోనే ఇచ్చిన హామీలను అమలు చేస్తున్నామన్నారు. గత పదేళ్లలో బీఆర్ఎస్, బీజేపీ ఏం చేసిందో ప్రజలు గమనించాలని మంత్రి పొన్నం అన్నారు.




# హైదరాబాద్ లోనే రామ్ గోపాల్ వర్మ?

హైదరాబాద్ : రామ్ గోపాల్ వర్మ పరారీలో ఉన్నారు. ఆయన కోసం పోలీసులు గాలిస్తున్నారు. ఆయన హైదరాబాద్ లో ఉన్నట్లుగానే భావిస్తున్నారు. ఒక ప్రముఖ నటుడి ఫాంహౌస్ లో ఉన్నట్లు అనుమానిస్తున్నారు. శంషాబాద్, షాద్ నగర్ లోని రెండు ఫాంహౌస్ లపై ఫోకస్ పెట్టారు. అయితే వర్మ తాను మాత్రం కొయంబత్తూర్ లో ఉన్నట్లు ట్విట్ చేశారు. ఆయన పోస్టులన్నీ హైదరాబాద్ నుంచి చేసినట్లుగా పోలీసులు గుర్తించారు.



## విచారణకు డుమ్మా

హైదరాబాద్ : ఒంగోలు పోలీసుల విచారణకు రామ్‌గోపాల్ వర్మ డుమ్మా కొట్టారు. ఈరోజు విచారణకు హాజరు కావాల్సి ఉంది. ఆయన విచారణకు రాలేనని రెండు వారాల పాటు గడువు కావాలని కోరారు వర్మ. విచారణకు రాకపోవడంతో పోలీసులు హైదరాబాద్‌లోని ఆర్జీవీ ఇంటికి వెళ్లికి వెళ్లారు. ఆర్జీవీ ఇంట్లో లేరని సిబ్బంది తెలిపారు. కోయంబత్తూర్‌లో ఆర్జీవీ ఉన్నట్లు సమాచారం తెలిసింది. చెన్నై పోలీసులతో ప్రకాశం పోలీసుల సంప్రదింపులు జరుపుతున్నారు. కోయంబత్తూర్‌కు ప్రత్యేక పోలీసు బృందం వెళ్లనుంది.